ఆరు బయట చెత్త వేయొద్దు : సర్పంచి

ఉంగుటూరు: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఇళ్లల్లో పొడి, తడి చెత్తలను ప్రత్యేకంగా అందించిన టబ్బుల్లో వేయాలని నారాయణపురం సర్పంచి దిడ్డ అలకనంద అన్నారు. మంగళవారం టూరింగు పేట రామాలయం వద్ద స్వచ్ఛ భారత్-స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్-స్వచ్ఛ నారాయణపురంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. బయట చెత్త వేయడం వల్ల జరిగే అనర్థాలను మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం తడి, పొడి చెత్త సేకరణకు ప్లాస్టిక్ డబ్బాలను సర్పంచి మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, సచివాలయం సిబ్బంది, కూటమి నాయకులు ఆలపాటి గిరీష్, బొమ్మిడి అనిల్, సప్పా బుచ్చిరాజు, రాంబాబు పాల్గొన్నారు.


చెత్త సేకరణ డబ్బాలు అందిస్తున్న సర్పంచి

ఓపి.. ఫీ'జులుం'..!

'వెంకటేశ్వరరావు అనే వ్యక్తి కాలునొప్పితో తాడేపల్లిగూడెంలో ఓ ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లారు. ఓపీ చీటీ కింద రూ.400 తీసుకున్నారు. వారం మాత్రమే పని చేస్తుందని చెప్పారు. వారం రోజులు దాటి ఒక్కరోజు గడిచినా మళ్లీ రూ.400 పెట్టి ఓపీ చీటీ తీసుకోవాల్సిందే అన్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో ఓపీ చీటీ నుంచి మందుల వరకూ బాదుడే బాదుడు అన్నట్లు పరిస్థితి మారిపోయింది'.

ఏలూరుకు చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి పట్టణంలోని ప్రయివేటు ఆసుపత్రికి వెళ్తే ఓపీ చీటీ కింద రూ.500 తీసుకున్నారు. కేవలం పది రోజులు మాత్రమే గడువు అన్నారు. ఇదేమని అడిగితే మా ఆసుపత్రిలో ఇంతేనని సమాధానమిచ్చారు. పరీక్షలు, మందుల పేరుతో బిల్లు తడిసిమోపెడైంది.'

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రయివేటు ఆసుపత్రులపై వైద్యఆరోగ్యశాఖ పర్యవేక్షణ కొరవడింది. దీంతో ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలు 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్నట్లుగా పరిస్థితి తయారైంది. ఓపి అవుట్ పేషెంట్) చీటీ దగ్గర నుంచి రక్త పరీక్షలు, స్కానింగ్‌లు, మందుల పేరుతో జనాలను నిలువు దోపిడీ చేస్తున్న పరిస్థితి ఉంది. చిన్నపాటి అనారోగ్యం వచ్చిన సామాన్య ప్రజానీకం బెంబేలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. ఆహారంలో కల్తీ, మారిన జీవనశైలితో చిన్న, పెద్ద తేడా లేకుండా అందరినీ రోగాలు చుట్టుముడుతున్నాయి. ప్రభుత్వాసుపత్రుల్లో అరకొర సదుపాయాలే ఉండటంతో జనం ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్తే ఇల్లు, ఒల్లు గుల్ల చేస్తున్న దుస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలో మొత్తం 262 ప్రయివేటు ఆసుపత్రులు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలోనూ అదే సంఖ్యలో ఆసుపత్రులు ఉన్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు 500 వరకూ ప్రయివేటు ఆసుపత్రులు ఉన్నాయి. ప్రతిరోజూ వేలాది మంది రోగులు ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్తుంటారు. ఇంతమంది జనం వెళ్తున్న ఆసుపత్రుల గురించి వైద్యఆరోగ్యశాఖ అసలు పట్టించుకోవడం లేదు. నిబంధనల ప్రకారం నెలకోసారి తనిఖీలు చేయాలని ఉన్నప్పటికీ అటువంటి పరిస్థితి లేదనే చెప్పాలి. ముఖ్యంగా ఓపీ ఫీజు విషయంలో నిబంధనలు ఏమిటో ఏఒక్కరికీ అర్థంకాని పరిస్థితి ఉంది. ప్రయివేటు ఆసుపత్రులు ఓపీ ఫీజులను ఇష్టానుసారం పెంచేస్తూ గడువు సమయాన్ని తగ్గించేస్తున్నాయి. ఓపీ ఫీజు అనేది ఏవిధంగా నిర్ణయిస్తారు.. దీనికి నిబంధనలు ఏమైనా ఉన్నాయా.. లేక ఇష్టానుసారంగా నిర్ణయించుకోవచ్చా అనేది అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. రక్తపరీక్షలు, స్కానింగ్‌లు అక్కడే చేయించుకోవాలి. మందులు సైతం అక్కడే తీసుకోవాలి. ఆ మందులు మరెక్కడా దొరకవు. నిబంధనల ప్రకారం ఓపీ ఫీజు నుంచి పరీక్షల వరకూ అన్నింటికీ సంబంధించి వసూలు చేసే ధరల పట్టిక ఆసుపత్రుల ఆవరణలో బోర్డు పెట్టి ప్రదర్శించాల్సి ఉంది. అటువంటి పరిస్థితి ఎక్కడా కానరాని పరిస్థితి. ఎక్స్‌రే ఖరీదు రూ.300 ఉండగా చాలా ఆసుపత్రుల్లో రూ.450 వరకూ వసూలు చేస్తున్నారు. అదేమని ప్రశ్నిస్తే అనేక కారణాలు చెబుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వైద్యుల నుంచి ఆసుపత్రి సిబ్బంది వరకూ రోగులపై తీవ్ర ఆగ్రహావేశాలు ప్రదర్శించడం పరిపాటిగా మారిపోయింది. వేరే ఆసుపత్రికి వెళ్లాలని సమాధానం సైతం వస్తోంది. ప్రయివేటు ఆసుపత్రుల నిర్వహణకు సంబంధించిన నిబంధనలపై వైద్యఆరోగ్యశాఖ సైతం ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. ప్రయివేటు ఆసుపత్రుల నుంచి అధికారులు మామూళ్లు తీసుకుని పట్టించుకోవడం లేదనే విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

చిన్నపాటి రోగానికి సైతం రూ.వేలల్లో ఖర్చు

జ్వరంతో ప్రయివేటు ఆసుపత్రికి వెళ్తే కనీసంగా రూ.నాలుగు నుంచి రూ.ఐదు వేలు ఖర్చవుతోంది. నిబంధనల ప్రకారం మందుల చీటిపై మందు పేరు మాత్రమే రాయాలి. ప్రయివేటు ఆసుపత్రుల్లో ఇప్పటికీ బ్రాండ్ పేర్లే రాస్తున్నారు. అవి వారి ఆసుపత్రిలో తప్ప ఇంకా ఎక్కడా దొరకని పరిస్థితి ఉంటుంది. కిడ్నీ, ఊపిరితిత్తులు వంటి పెద్ద సమస్యలతో వెళ్తే ఎంత బిల్లు అవుతుందో చెప్పలేని పరిస్థితి ఉంది. ఆరోగ్యశ్రీ ఉన్నా చాలాచోట్ల సొమ్ము వసూలు యథేచ్ఛగా సాగిపోతుంది. ఫిర్యాదు చేస్తే సరిగా పట్టించుకోరనే భయంతో రోగులు, వారి బంధువులు నిస్సహాయంగా ఉండిపోతున్నారు. ఆరోగ్యశ్రీలో వైద్యం చేస్తూ అదనపు సొమ్ము వసూలు చేస్తే ఫిర్యాదు చేయండంటూ ఆరోగ్యశ్రీ అధికారులు చెబుతున్నా పెద్దగా రోగులు ముందుకు రాని పరిస్థితి ఉంది.

- ప్రయివేటు ఆసుపత్రులపై ప్రభుత్వ పర్యవేక్షణ కరువు
- రెండు జిల్లాల్లో దాదాపు 500 వరకూ ప్రయివేటు ఆసుపత్రులు
- పదిరోజుల గడువు ఓపి చీటీకి రూ.400 నుంచి రూ.వెయ్యి వరకూ వసూలు
- గతంలో నెల రోజులు గడువు చీటీకి రూ.వంద మాత్రమే
- లాబొరేటరీ ఐఁడాంగా ప్రయివేటు ఆసుపత్రుల ఇష్టారాజ్యం
- పరీక్షలు, మందులు సమస్తం అన్నీ అక్కడే
- జ్వరంతో వెళ్లినా రూ.ఐదు వేలకుపైగా బాదుడు

ప్రయివేటు ఆసుపత్రుల్లో దోపిడీపై ప్రభుత్వం దృష్టి సారిస్తేనే సామాన్య ప్రజానీకానికి మేలు జరిగే అవకాశం ఉంది. లేకపోతే కష్టపడి సంపాదించిందంతా ప్రయివేటు ఆసుపత్రులకే సరిపోయే పరిస్థితి.

భూసమస్యల్లో పోలీసుల జోక్యం నివారించండి

ఎస్‌పికి సిపిఎం బృందం వినతి


ఎస్‌పికి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం జిల్లా నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏజెన్సీ భూసమస్యల్లో పోలీసుల అనుచిత జోక్యం నివారించాలని కోరుతూ సిపిఎం జిల్లా బృందం జిల్లా ఎస్‌పికి మంగళవారం వినతిపత్రం అందించింది. ఏజెన్సీలో భూసమస్యల్లో పోలీసుల అనుచిత జోక్యం పెరుగుతుందని, గిరిజనులపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ బెదిరిస్తున్నారని, గిరిజనుల పంటను నాశనం చేసిన భూస్వాములపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డివిఎస్‌వి.ప్రసాద్, కె.శ్రీనివాస్‌తో కూడిన బృందం మంగళవారం జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్‌ను కలిసి వినతిపత్రం అందించింది. దీనికి సంబంధించిన వివరాలతో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న 1/70 చట్టం భూముల్లో గిరిజనేతర భూస్వాములకు ఇచ్చిన ప్రొటెక్షన్ ఆర్డర్లను రద్దు చేయాలని, గిరిజనుల సాగులో ఉన్న ఎల్‌టిఆర్ భూములకు గిరిజనులకే పట్టాలివ్వాలని, ప్రభుత్వ భూముల్లో పేదలైన గిరిజనులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని అధికారులను కోరారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి తహశీల్దార్లు గిరిజనులకు వ్యతిరేకంగా గిరిజనేతరులకు అనుకూలంగా ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇచ్చారని తెలిపారు. దీంతో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి పోలీసులు సదరు భూముల్లోకి గిరిజనులు వస్తే బెయిల్ రాకుండా కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే ఏజెన్సీ భూసమస్యలను పరిష్కరించి గిరిజనులకు తగు న్యాయం చేయాలని, భూస్వాములకు అనుకూలంగా ఇచ్చిన ప్రొటెక్షన్ ఆర్డర్లను రద్దు చేయాలని, 1/70 చట్టం భూములపై పోలీసుల జోక్యం ఆపాలని, గిరిజనులపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని ఆయన కోరారు. గిరిజనుల పంటను నాశనం చేసిన భూస్వాములపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌టి కమిషన్ సభ్యులు శ్రీనివాస్ ఆదేశించినట్లు బుట్టాయగూడెం మండలం ఆర్‌ఎస్ నెంబర్ 550/3, 4లో గిరిజన పేదలు గుడిసెల విషయంలో పోలీసుల జోక్యం నివారించాలని కోరారు. జిల్లా ఎస్‌పి దీనిపై స్పందిస్తూ మీరు తెలిపిన అంశాలను పరిశీలించి చట్టప్రకారం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. గిరిజన యువత స్వయం ఉపాధి అవకాశాలకు పోటీపడేలా వారిని చైతన్యపరచాలని సిపిఎం బృందానికి ఎస్‌పి సూచించారని చెప్పారు.

23న ఉల్లాస్ పరీక్షకు 732 కేంద్రాలు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమం కింద నమోదైన నిరక్షరాస్యులైన వయోజనులకు ఈ నెల 23వ తేదీన నిర్వహించే పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఉల్లాస్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై వయోజన విద్య, విద్యాశాఖ తదితర అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమం కింద అక్షరాస్యత శిక్షణ పూర్తి చేసిన 7,321 మంది ఈ పరీక్షలు రాయనున్నారని, అందుకోసం 732 పాఠశాలలు గుర్తించి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ వారు ఈ నెల 23వ తేదీ ఆదివారం అంగన్వాడీ సెంటర్లోగానీ, స్థానిక పాఠశాలలోగాని ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. పరీక్ష ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, ఈ మధ్యలో ఏ మూడు గంటలైనా అభ్యర్థులు పరీక్ష రాయవచ్చన్నారు. ఎంఇఒలు, సెర్ప్ ఎపిఎం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఈ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఐసిడిఎస్ పీడీ పి.శారద, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, వయోజన విద్యా శాఖ డిడి ప్రభాకరరావు, ఉల్లాస్ నోడల్ అధికారి ఆర్.విజయకుమార్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 94 శాతం హాజరు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో మంగళవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం భౌతిక శాస్త్రం, అర్థశాస్త్రం పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.యోహాన్ తెలిపారు. మొత్తం 55 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు మొత్తం 19,237 మందికి 18,050 మంది హాజరయ్యారని, 1,187 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. 94 శాతం హాజరు నమోదైందన్నారు. సాధారణ విభాగంలో 16,660 మందికి 15,882 మంది హాజరవ్వగా 778 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో మొత్తం 2,577 మందికి 2,168 మంది హాజరవ్వగా 409 మంది గైర్హాజరయ్యారు.

ఇళ్ల నిర్మాణం పూర్తికి అదనపు ఆర్థిక సాయం

జిల్లాలో 49,436 మందికి చేకూరనున్న లబ్ధి : కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

స్వర్ణాంధ్ర-2047 విజన్ సాకారంలో భాగంగా 2029 నాటికి అందరికీ ఇళ్లు ఏర్పర్చాలనే దృఢ నిశ్చయంతో అసంపూర్తిగా నిలిచిన ఇళ్ల నిర్మాణం పూర్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. దీనిలో భాగంగా పిఎంఎవై 1.0లో ఇల్లు మంజూరై ఇంకా వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వం జిఒ నెం.9 విడుదల చేసిందని తెలిపారు. జిల్లాలో దాదాపు 49,436 మంది బిసి, ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారుల ఇళ్లు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయన్నారు. బిసిలు 27,150, ఎస్‌సిలు 18,452, ఎస్‌టిలు 3,293, పివిటిజిలు (ఆదివాసీ గిరిజనులు) 541 మంది లబ్ధిదారులు ఉన్నట్లు గుర్తించినట్లు వివరించారు గృహనిర్మాణం పూర్తికి యూనిట్ విలువ రూ.1.80 లక్షలకు అదనంగా ఎస్‌సిలు, బిసిలు అందరికీ రూ.50 వేలు, ఎస్‌సిలకు రూ.75 వేలు, పివిటిజి (ఆదివాసీ గిరిజనులకు) రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అదనంగా అందిస్తుందని తెలిపారు. అయితే వీటి నిర్మాణాన్ని వచ్చే ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తి చేసుకోవాలన్నారు. నిర్మాణం పూర్తి చేసుకునే దశలవారీగా అదనపు మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాకు నేరుగా జమ చేస్తారన్నారు. ఈ మేరకు లబ్ధిదారులు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవడానికి తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ జి.సత్యనారాయణను కలెక్టర్ ఆదేశించారు. అలాగే గృహ నిర్మాణ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమెనిటిస్, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవడంలో నిధుల మంజూరుకు మధ్యవర్తులు, ఇతరుల మోసపూరిత మాటలు నమ్మరాదని, ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత మండల గృహనిర్మాణ కార్యాలయం, ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్లను సంప్రదించాలన్నారు. లబ్ధిదారులు ఈ అదనపు ఆర్థిక లబ్ధి సదవకాశాన్ని వినియోగించుకుని తమ సొంతింటి కల సాకారం చేసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.

జిల్లాలకు ప్రత్యేక ఇన్‌ఛార్జి అధికారులు

ఏలూరుకు అమ్రాపాలి

'పశ్చిమ'కు ఎ.సూర్యకుమారి

జోనల్ అధికారిగా అజయ్ జైన్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణ, అమలుకు సంబంధించి జిల్లాలకు ప్రత్యేక ఇన్‌ఛార్జీలుగా ఐఎఎస్ అధికారులను ప్రభుత్వం నియమించింది. ఐదు జిల్లాలకు సంబంధించిన జోనల్ ఇన్‌ఛార్జీలుగా సీనియర్ ఐఎఎస్‌లను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం జాబితా విడుదల చేసింది. ఏలూరు జిల్లాకు ఇన్‌ఛార్జి అధికారిగా కె.అమ్రాపాలి నియమితులయ్యారు. పశ్చిమకు ఇన్‌ఛార్జి అధికారిగా ఎ.సూర్యకుమారిని నియమించారు. ఏలూరు, పశ్చిమ, కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు జోనల్ ఇన్‌ఛార్జిగా సీనియర్ ఐఎఎస్ అధికారి అజయ్‌జైన్‌ను నియమించారు. జిల్లా ఇన్‌ఛార్జి అధికారులుగా నియమితులైన వారు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులకు సహాయకారిగా ఉండాలి. 15 రోజులకొకసారి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించడంతోపాటు వివిధ పనులను ఇన్‌ఛార్జి అధికారులకు ప్రభుత్వం అప్పగించింది.

అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

కుక్కునూరు : సమస్యలు పరిష్కరించమంటే బెదిరింపులకు పాల్పడతారా అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు ప్రశ్నించారు. మంగళవారం కుక్కునూరులో అవినీతికి పాల్పడుతున్న విద్యుత్ సబ్ స్టేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ మండలంలోని కొన్ని గ్రామాల్లో గిరిజన భూముల్లో గిరజనేతరులు నిర్వహిస్తున్న నర్సరీలకు కుక్కునూరు ఎఇ లంచం తీసుకుని అక్రమంగా విద్యుత్ వినియోగించుకునే సౌకర్యం కల్పించారన్నారు. మంగళవారం నర్సరీ యాజమాన్యం అక్రమంగా వినియోగించుకుంటున్న విద్యుత్‌పై తహశీల్దార్‌ని కలిసిన సందర్భంలో కంప్యూటర్ ఆపరేటర్ సుబ్బారావు సిపిఎం నాయకుడిపై అసభ్యకరంగా మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడ్డాడన్నారు. అవినీతికి పాల్పడుతున్న కుక్కునూరు సబ్ స్టేషన్ ఎఇ మోహన్ రావు, కంప్యూటర్ ఆపరేటర్ సుబ్బారావును వెంటనే సస్పెండ్ చేసి, నర్సరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో షేక్ వలిపాషా ఉన్నారు.

పన్నులు నూరుశాతం వసూలు చేయాలి: డిపిఒ

కలపర్రులో పారిశుధ్యం పరిశీలిస్తున్న డిపిఒ

పెదపాడు : గ్రామ పంచాయతీల్లో నూటికి నూరుశాతం పన్ను వసూళ్లతోపాటు, నూరుశాతం ఇంటింటికీ చెత్తసేకరణ జరగాలని జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని కలపర్రు, వట్లూరు గ్రామాల్లో ఆమె పర్యటించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులకు సంబంధించి పరిశీలించారు. కలపర్రులోని ప్రాథమిక పాఠశాల వద్ద చెత్త ఇష్టానుసారంగా వేయడంపై అక్కడి సిబ్బందితో మాట్లాడారు. స్కూల్ పిల్లలతో ప్రత్యేకంగా మాట్లాడి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. పన్నుల వసూలు సక్రమంగా జరిగితే ఎటువంటి ఉపయోగాలు ఉంటాయో విద్యార్థులకు తెలియజేసి, మీ తల్లిదండ్రులకు వివరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకూ 60 శాతం పన్నుల వసూళ్లు జరిగినట్లు ఆమె తెలిపారు. ఇఒపిఆర్‌డి ఎస్.సూర్యకుమార్, డిపిఎం సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు శివయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

సూపర్ సిక్స్ పథకాల అమలే లక్ష్యం : ఎంఎల్ఎ బడేటి

ఏలూరు సిటీ : సూపర్ సిక్స్ పథకాల అమలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎంఎల్ఎ బడేటి చంటి పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను మంగళవారం ఎంఎల్ఎ బడేటి చంటి దృష్టికి తీసుకొచ్చారు. తనను కలిసేందుకు వచ్చిన వారిని కలిసి నేనున్నానంటూ వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అందుకే సూపర్ సిక్స్ పథకాల అమలే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సమస్యల పరిష్కారానికి..

నేడు మహాధర్నాను జయప్రదం చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కారానికి ఈనెల 12వ తేదీన విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం తెలిపారు. మండలంలోని కేతవరం, పట్టినపాలెం, శ్రీనివాసపురం, మైసన్నగూడెం, వేగవరం గ్రామాలలో ఉపాధి హామీ కూలీల వద్దకు పర్యటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు చెప్పిన విషయాలు, వారి బాధలు, రావలసిన వేతన బకాయిలు రాష్ట్ర కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని కూలీలకు హామీ ఇచ్చారు. అనంతరం జీవరత్నం మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి రావలసిన వేతన బకాయిలు మండలంలో రూ.80 లక్షల వరకు ఉన్నాయని, తక్షణమే ఈ వేతన బకాయిలు విడుదల చేయాలని అధికారులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే గత మూడు నెలల కాలం నుంచి చేసిన పనికి వేతనాలు రాక కూలీలు పస్తులు ఉంటున్నారని, ప్రత్యామ్నాయం లేక మండుటెండలను సైతం లెక్కచేయకుండా పొట్ట చేత పట్టుకుని కూలీలు బతుకుతెరువు కోసం వలసలు వెళుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రైతు వారి పనులకు ఉదయం 6 గంటలకు వెళ్లి సాయంత్రం ఐదు గంటల వరకు గొడ్డిసాకిరి చేస్తున్నారని, దీనికి అంతటికి కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కూలీల బకాయిలు విడుదల చేయకపోవడమే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని గ్రామాలలో పర్యటించామని, ఎక్కడా కూడా కూలీలకు చేసిన పనికి స్లిప్పులు ఇవ్వటం లేదని, పంగిడిగూడెం, తిరుమలపురం, కేతవరం, పట్టేణపాలెం గ్రామాలలో పనికి రాకపోయినా అక్రమ పద్ధతిలో మస్టర్లు వేసి ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారులు ప్రభుత్వ ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారని మండిపడ్డారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేయటానికి కుట్రలు, కుతంత్రాలు పన్ని కూలీలకు డబ్బులు రాకుండా చేస్తున్నారని, ఈ చట్టాన్ని రైతుకు అనుసంధానం చేసి చట్టమే లేకుండా చేయాలని నరేంద్ర మోడీ, చంద్రబాబు చూస్తున్నారన్నారు. ఈ సమస్యలపై నేడు విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద పెద్ద ఎత్తున రాష్ట్రంలోని ఉపాధి కూలీలను 10 వేల మందిని సమీకరించి మహాధర్నా చేపడుతున్నామని, ఈ ధర్నాకి మండలం నుంచి ఉపాధి హామీ వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు జోడే సూర్యచంద్రం, కె.సుబ్బారావు, వి.నర్సిరావు, పిల్లి సుబ్బారావు, జి.సూర్య కిరణ్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరు అర్బన్ : ప్రసాద్ సీడ్స్ మొక్కజొన్న ఫ్యాక్టరీలో పనిచేస్తున్న యువకుడు ప్రమాదానికి గురై అక్కడికక్కడే చనిపోయాడని, అతని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొని న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయనొక ప్రకటన విడుదల చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి ఫ్యాక్టరీలలో జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకొని యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పెదవేగి మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో నివాసముంటున్న సింగపాము రవీంద్ర(30) ప్రసాద్ సీడ్స్ మొక్కజొన్న ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడని, మంగళవారం యధావిధిగా పనిచేయడానికి వెళ్లిన అతను మిషన్‌లో పడి అక్కడికక్కడే ముక్కలు ముక్కలై చనిపోయాడని తెలిపారు. ఈ ఘటన తనని తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. మృతిచెందిన యువకుడి కుటుంబాన్ని ఫ్యాక్టరీ యజమాన్యం ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తరచుగా ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నా అటు ప్రభుత్వం నుంచిగాని, ఇటు ఫ్యాక్టరీల యజమానుల నుంచిగాని ఏవిధమైన చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవని విమర్శించారు. కార్మిక శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకొని ఫ్యాక్టరీ యజమానులపై కఠినచర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల ప్రాణాలకు విలువ లేకుండా పోతోందని, యజమానులు ప్రమాదాల నివారణకు చర్యలకు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నీటిఎద్దడి ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు

జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. స్థానిక జెడ్‌పి క్యాంప్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారులతో ఆమె మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ తాగునీటి సమస్యలు తలెత్తకూడదనే ఉద్దేశంతో వేసవి ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. బోర్లు, పైప్‌లైన్లు, ట్యాంకుల మరమ్మతులు తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. రాబోయే వర్షాకాలానికి ముందే గ్రామాల్లో కాలువల పూడికతీత చేపట్టాలన్నారు. జల జీవన మిషన్ కింద పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, జిల్లా పరిషత్ నిధుల ద్వారా మంజూరైన పెండింగ్ పనులపై పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో అసౌకర్యం కలగకుండా పక్కా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ సిఇఒ కె.భీమేశ్వరరావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

రాజానగరం ప్రధానోపాధ్యాయినిని సస్పెండ్ చేయాలి

ఐటిడిఎ పిఒ తీరు సరికాదు

ఆదివాసీ గిరిజన సంఘం, ఆదివాసీ గిరిజన జ్యోతి జిల్లా కమిటీలు

ప్రజాశక్తి - బుట్టాయిగూడెం

రాజానగరం గిరిజన బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయినిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం, ఆదివాసీ గిరిజన జ్యోతి జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. ఆశ్రమ గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆశావతు వెంకమ్మ సాటి ఉపాధ్యాయులను మానసికంగా వేధించడంమే కాకుండా కులం పేరుతో దూషిస్తున్నారని పేర్కొన్నారు. అదనపు పనులిచ్చి మానసికంగా ఇబ్బందులు గురి చేస్తున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే వేధింపులు మరింత పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే విచారణ చేపట్టి తక్షణమే ప్రధానోపాధ్యాయినిని విధుల నుంచి సస్పెండ్ చేయాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. దీనిపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన సంఘ నేతలపై ఐటిడిఎ పిఒ రాములు నాయక్ కనీసం వినతిపత్రం తీసుకోకుండా, తమ కార్యాలయంలోకి రావొద్దని అవమానకరంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించాయి. దీన్ని బట్టి ప్రధానోపాధ్యాయినికి పిఒ వత్తాసు పలుకుతున్నట్లు స్పష్టమవుతుందని, సమస్య వినకుండా తాను గిరిజనుడినేనని దురుసుగా వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. పిఒ వైఖరిని మార్చుకోకపోతే గిరిజన సంఘాల ఆధ్వర్యాన పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తెల్లం రామకృష్ణ, కూమరం సత్యనారాయణ, పోలోజు నాగేశ్వరరావు, అనూష, నాగమణి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

షాపు యజమానులు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ

టి.నరసాపురం : నేరగాళ్ల పట్ల షాపు యజమానులు అప్రమత్తంగా వుండాలని ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో వర్తక సంఘాలకు మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులందరూ సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా వుండాలన్నారు. షాపు యజమానులందరూ తమ వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రి సమయంలో దొంగలు చోరీకి పాల్పడకుండా నైట్ వాచ్‌మెన్ ఏర్పాటు చేసుకోవాలని ఆయన తెలిపారు. షాపు యజమానులు అందరూ తమ ప్రోపర్టీని కాపాడుకోడానికి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జూలూరి గోపి, ముత్తంశెట్టి శ్రీనివాస్, జె.మణి కంఠ, సుబ్బరాజు, పరిమి కళ్యాణ్, నోముల సత్యనారాయణ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

పేదవాడి పూర్తి ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని గుళ్లపూడి గ్రామానికి చెందిన నూర్ భాష ఆయిషా రజియాల్(15) విజయవాడ హెల్ప్ హాస్పటల్లో ప్రాణాపాయ స్థితిలో ఉండి చికిత్స పొందుతూ మెరుగైన వైద్యం కోసం మంత్రిని ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న మంత్రి వెంటనే సిఎం సహాయనిధి నుంచి 4 గంటల్లో మెరుగైన వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులకు సుమారు రూ.2.50 లక్షల విలువైన చెక్కును స్వయంగా మంత్రి హాస్పిటల్‌కి వెళ్లి చెక్కును అందజేశారు. వైద్యులతో మాట్లాడి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, మధు, బాలిక తల్లిదండ్రులు ఉన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తులు

కొయ్యలగూడెం : ప్రభుత్వం బిసి, కాపు, అగ్రవర్ణ పేద మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ, కుట్టుమిషన్ అందించేందుకు కొత్త పథకాన్ని ప్రారంభించింది. ఎంపిడిఒ, అధికారులు ఈ పథకంపై వివరాలను వెల్లడిస్తూ ఈ పథకం ద్వారా 18–50 సంవత్సరాల వయస్సు ఉన్న అర్హత గల మహిళలు ఉచితంగా కుట్టు శిక్షణ పొందవచ్చన్నారు. సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాలు, మీ పరిధిలో ఉన్న వార్డు లేదా గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. దరఖాస్తు చేయడానికి రైస్ కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్, కుల ధృవీకరణ పత్రం అవసరం. దరఖాస్తులను ఈనెల 22 లోపు చేసుకోవాలన్నారు. ఈ పథకం మహిళల ఆర్థిక స్వావలంబనకు దారితీస్తుందని, కుటుంబ సభ్యులకు కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని అధికారులు తెలిపారు.

రత్నకుమార్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత

ఏలూరు సిటీ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో క్షయ వ్యాధి నివారణ విభాగంలో హెల్త్ విజిటర్‌గా విధులు నిర్వహిస్తూ 2023లో బండి రత్నకుమార్ మరణించారు. విధులలో ఉండి మరణించారని వారి కుటుంబానికి నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా వచ్చే ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షలను జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాలిని చేతుల మీదుగా బండి రత్న కుమార్ భార్య బండి మేరీ క్రిస్టియానాకి మంగళవారం చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి డి.ఎం.ప్రసాద్, ఎ.పవన్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి : ఎంఎల్ఎ

చింతలపూడి : చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విభాగాలు సహకరించాలని, జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించబడిన ఆమ్రపాలిని ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ కోరారు. జిల్లాకు ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణ, ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి ప్రత్యేకాధికారిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆమ్రపాలిని నియమించడంతో ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఘనంగా మెగా ఎక్స్‌పో 25 నిర్వహణ

నూజివీడు టౌన్ : ఆర్జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో టెక్ జైట్ 25లో భాగంగా ఘనంగా మెగా ఎక్స్‌పో 25 నిర్వహించారు. మెగా ఎక్స్‌పోలో మొత్తం 100 టీమ్‌లు తమ ప్రాజెక్టులకు సంబంధించిన సారాంశాలను సమర్పించారు. 86 టీమ్‌లు తమ ప్రాజెక్ట్‌లను పిపిటి రూపంలో ప్రదర్శించాయి. అర్హత సాధించిన 56 టీమ్‌లు ప్రాజెక్ట్ అభివృద్ధి కోసం రూ.7 లక్షల 62 వేల మేర నిధులను కేటాయించారు. విద్యార్థులు తమ ఎఐ, డ్రోన్, రోబోటిక్స్ మీద నమూనాలను ప్రదర్శించి న్యాయనిర్ణేతలకు వివరించారు. ఈ కార్యక్రమానికి డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ రావు, విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాల హెచ్ఒడిలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతల కోసం రూ.30 వేల నగదు కేటాయించారు. డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ (డిఐసి), నిధి స్కీమ్ ఈ ఎక్స్‌పోకు విశేషంగా మద్దతు అందించి, ఎంపికైన ప్రాజెక్టుల అమలుకు నిధులను సమకూర్చడం ద్వారా విద్యార్థులకు ఆచరణాత్మకమైన పరిజ్ఞానం కల్పించేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు తమ సాంకేతికత ప్రతిభను కనబరచి, ఈ మెగా ఎక్స్‌పోను విజయవంతంగా పూర్తిచేసారు. టెక్ జైట్ 2025లో భాగంగా ప్రతీ ఇంజనీరింగ్ విభాగం నుంచి పలు అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు, సర్టిఫికెట్లను బహుమతిగా అందచేస్తారని తెలిపారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్, ఆర్జియుకెటి నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ప్రో. అమరేంద్ర కుమార్, ఎఒ డాక్టర్ లక్ష్మణ రావు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు 'యువత పోరు'

ఏలూరు సిటీ : త్రైమాసికాలుగా ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ.4,600 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని వైసిపి జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు కామిరెడ్డి నాని డిమాండ్ చేశారు. ఏలూరులోని దెందులూరు వైసిపి కార్యాలయంలో మంగళవారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కామిరెడ్డి నాని మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా ఫైర్ స్టేషన్ వద్ద రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి ర్యాలీగా కలెక్టరేట్ వరకు వెళ్లి కలెక్టర్‌కి డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల భృతిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా యువజన విభాగ కార్యదర్శి కట్ట ఏసుబాబు, వైసిపి జెడ్‌పిటిసిలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

చింతలపూడి : వైసిపి పదవులు పొందిన వారు వచ్చే 2029 ఎలక్షన్ ధ్యేయంగా, జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకునే విధంగా కష్టపడి పనిచేయాలని చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు అన్నారు. మండలంలో యువత పోరు పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. అదేవిధంగా స్థానిక నాయకులచే ఏర్పాటు చేసిన పార్టీ పదవుల పొందిన వారికి సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టరేట్ వద్ద విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ చంద్రబాబు సర్కారుపై నిరసన, కలెక్టర్‌కి వినతిపత్రం అందజేస్తామన్నారు. ముఖ్య నాయకులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉంగుటూరు : వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం చేబ్రోలులో నిర్వహించే కార్యక్రమానికి ఎంపిటిసి సభ్యులు, పార్టీ కేడర్, అభిమానులు హాజరుకావాల్సిందిగా ఆపార్టీ మండల కన్వీనర్ మరడ వెంకట మంగారావు మంగళవారం కోరారు. చేబ్రోలులో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్ర హం వద్ద కార్యక్రమం నిర్వహించి, అనంతరం ఫీజు రియంబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి విడుదల చేయాలని కోరుతూ ఏలూరులో నిర్వహించనున్న కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రావాలని విజ్ఞప్తి చేశారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చాట్రాయి : మండలంలోని చనుబండ గ్రామంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి మొండ్రు సురేష్ ఆధ్వర్యంలో జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవ వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నూజవీడు జనసేన సమన్వయ కర్త బర్మా ఫణిబాబు పాల్గొన్నారు. ఈనెల 14వ తేదీన జనసేన ఆవిర్భావ దినోత్సవానికి భారీ సంఖ్యలో జన సైనికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షులు తుమ్మల జగన్, కార్యదర్శి మిద్దె హరీష్, విస్సంపల్లి రాజా పాల్గొన్నారు.

రీసర్వే పారదర్శకంగా చేపట్టాలి : సిపిఐ

ఏలూరు అర్బన్ : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 కాంటూరు లెవెల్‌లో ముంపు బారిన పడుతున్న గ్రామాల రీ సర్వే పారదర్శకంగా చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సర్వే ప్రక్రియకు గ్రామాలలో ముందస్తు సమాచారం తెలపాలన్నారు. అయితే ఇప్పటికే నిర్వాసితులకు కొంతమందికి పరిహారం ప్రభుత్వం చెల్లించడం పట్ల సిపిఐ హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. అయితే ఉపాధి పనులు లేక కొంతమంది నిర్వాసితులు ఉపాధి నిమిత్తం వలసలు వెళ్లారని, అనంతరం తిరిగి వారి గ్రామాలకు చేరుకుంటారని, వీరిని స్థానికంగా ఉన్నట్లుగా గుర్తించి పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

'యువత పోరు జగన్ ఇంటి ముందు చేయాలి'

ఏలూరు సిటీ : వైసిపి ముఠా జగన్ రెడ్డి ఇంటి ముందు యువత పోరు చేయాలని టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు పెనుబోయిన మహేష్ యాదవ్ మండిపడ్డారు. టిడిపి జిల్లా కార్యాలయంలో టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహేష్ యాదవ్ మాట్లాడుతూ వైసిపి నాయకులు పోరుబాట కార్యక్రమాన్ని తాడేపల్లిలో చేయాలని మండిపడ్డారు. విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను మోసం చేసింది జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. డిఎస్‌సి విడుదల చేస్తానని అధికారంలోకి వచ్చి ఐదేళ్లలో ఒక్కసారి కూడా డిఎస్‌సి ప్రకటించలేదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు మారం సూర్య, పిలరి శెట్టి వింధ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సొంత ఊరిని గుర్తుపెట్టుకోవడం అభినందనీయం : ఎంఎల్ఎ

దెందులూరు : సొంత ఊరుపై, పుట్టి పెరిగిన ఇంటిపై మురళీమోహన్ అభిమానం ఎంతో అభినందనీయమని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరు నియోజకవర్గం పరిధిలోని ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామంలో జరిగిన మాజీ పార్లమెంటు సభ్యులు, ప్రముఖ సినీ నటులు, జయభేరి సంస్థల అధినేత మాగంటి మురళీమోహన్ గృహప్రవేశ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులతో కలిసి ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రముఖ భవన నిర్మాణ సంస్థ అయిన జయభేరి సంస్థ అధినేత మాగంటి మురళీమోహన్ తన పూర్వీకుల నుంచి వస్తున్న ఇంటిని ఎంతో అభిమానంతో తిరిగి పునర్నిర్మించుకుని తన భావితరాలకు కూడా అందించాలని భావించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా మురళీమోహన్ చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను అభినందించారు. ఇలాగే జీవితంలో మనం ఎవరు ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎక్కడకు వెళ్లినా, కన్న తల్లిని, సొంత ఊరును ఎప్పటికీ మర్చిపోకూడదని, ఎవరు ఎంత గొప్ప స్థాయికి చేరుకున్నా తమ సొంత ఊరుకి, కన్నతల్లికి అండగా నిలిచినప్పుడే వారి జీవితానికి, విజయానికి సార్థకత లభిస్తుందని ఎంఎల్ఎ తెలిపారు.

'పది' విద్యార్థులకు కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలోని శ్రీఅన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ గౌతమ్, డాక్టర్ ఎస్‌కె.నజ్మాచే పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, పెన్, స్కేల్, పెన్సిల్, రబ్బర్, షార్పనర్ బహుకరించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుని పి.రాధికారాణి తెలిపారు. అనంతరం డాక్టర్ గౌతమ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే కష్టపడే తత్వం అలవాటు చేసుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు. తాను చాలా కష్టపడి చదివానని, డాక్టర్ కావాలి అనే కోరిక చదువుకొనే వయస్సు నుంచే ఉండేదని తెలిపారు. కిందటి సంవత్సరం నుంచి ఇద్దరు డాక్టర్స్ కలసి పదవ తరగతి విద్యార్థులకు పరీక్షకు సంభందించిన మెటీరియల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కష్టపడి చదివి మంచి మార్కులతో పాస్ అవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కౌసిక్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీను, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ భావిశెట్టి వీరయ్య, ఉపాధ్యాయ సిబ్బంది మోహన్ రావు, రవీంద్ర పాల్గొన్నారు.

వాహనదారులు లైసెన్స్ అందుబాటులో ఉంచుకోవాలి

అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జగదీష్

ప్రజాశక్తి - మండవల్లి

వాహన పత్రాలు అందుబాటులో ఉంచుకొని వాహనాలు నడపాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జగదీష్ స్పష్టం చేశారు. మండలంలోని లోకుమూడి సెంటర్లో మంగళవారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలను పాటిస్తేనే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయగలమని అన్నారు. నిబంధనలు పాటించకపోవడంతో పెద్ద ఎత్తున ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నివారణకు ఎత్తున ప్రత్యేక డ్రైవరు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, వాహనాలను నడపాలని తెలిపారు. త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా లేని వాహనాలపై కేసును నమోదు చేస్తున్నామని అన్నారు. అనంతరం హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాలను, లైసెన్స్ ఆవశ్యకతను వాహనదారులకు వివరించారు. ఈ తనిఖీలో ఇన్‌స్పెక్టర్ డి.ప్రజ్ఞ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో అంగన్వాడీలకు మంగళవారం ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ కె.ధనలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా అందించే పోషకాహారంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. బాల్యంలో ఉన్న చిన్నారులకు పూర్వ విద్య కథలు, పాటల ద్వారా తెలపాలన్నారు. వివిధ పరికరాలతో చిన్నారులకు ఆటలు నేర్పాలన్నారు. ప్రణాళికాబద్ధంగా ముందడుగులు వేసేందుకు ప్రత్యేకమైన శిక్షణా కార్యక్రమాలను అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం చిన్నారుల పురోభివృద్ధి, ఆరోగ్యం, బాల్యదశను కాపాడేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇటీవల చిన్నారులు ఆడుకునేందుకు ప్రత్యేక పరికరాలు దిగుమతి అయినట్లు చెప్పారు. ఈ ఆట వస్తువులను అన్ని అంగన్వాడీ సెంటర్లకు పంపిణీ చేశామన్నారు. కొత్తగా వచ్చిన ఆట వస్తువులతో చిన్నారులు ఎంతో ఆనందంగా ఆడుతూ, పాడుతూ కనిపిస్తున్నారని సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా ధనలక్ష్మి, సూపర్వైజర్లు సులోచన, రమాదేవి పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

నిరంతర కృషితోనే 'పది'లో ఉత్తమ మార్కులు

ఎస్‌టియు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

దెందులూరు : విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించాలంటే నిరంతర సాధన, పట్టుదల వల్లే సాధ్యమవుతుందని పెదవేగి మండల విద్యాశాఖ అధికారులు సబ్బిత నరసింహమూర్తి, అరుణ్ కుమార్‌లు చెప్పారు. మంగళవారం పెదవేగి మండలం పెదవేగి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ప్యాడ్, రెండు బ్లూ పెన్స్, పెన్సిల్, లాంగ్ స్కేల్, వృత్తలేఖిని, పౌచ్, హాల్ టికెట్ పౌచ్‌లను పెదవేగి మండల శాఖ తరపున అందించారు. ఈ సందర్భంగా ఎంఇఒ 1, 2లు మాట్లాడు తూ విద్యా సవత్సరమంతా అధ్యాపకులు చక్కని బోధన ద్వారా విద్యార్థులకు విజ్ఞానాన్ని అందిస్తారని, పరీక్షల సమయంలో బోధనా అంశాలను పున పరిశీలించుకుని, చక్కగా సిద్ధమవడం అనేది విద్యార్థుల చేతిలోనే ఉంటుందన్నారు. ప్రధానంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించాలంటే ప్రాణాళికాయుతమైన సాధన, కృషి, పట్టుదల అవసరమన్నారు. సర్పంచి శ్రీరామ్ మూర్తి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాత సత్యనారాయణలు, ప్రవీణ్, షఫీ, భూషణం, గుప్తా, రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతన బకాయిలు విడుదల చేయాలి

వ్యకాస మండల కార్యదర్శి సత్తు కోటేశ్వరరావు

ఆగిరిపల్లి : ఉపాధి హామీ కూలీల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కనీస వేతనం రోజుకి రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సత్తు కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని తోటపల్లి, చిన్నాగిరిపల్లి, చొప్పరమెట్ల, ఈదులగూడెం గ్రామాల్లో పర్యటించి ఉపాధి హామీ కూలీలకు, వ్యవసాయ కార్మికులకు ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఈనెల 12న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పనిప్రదేశంలో షామియానా, మెడికల్ కిట్లు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో వుంచాలన్నారు. పనిదినాలను పెంచాలని, జాబ్‌కార్డులు లేని కుటుంబాలకు జాబ్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు పి.తాతారావు, కె.కృష్ణ, ఆమని, సుశీల, లెనిన్, కోటమ్మ, సుభాకర్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : వంద రోజులు ఉపాధి పని పూర్తి చేసుకున్న గ్రామీణ పేదలకు అదనంగా పని దినాలు కల్పించాలని తదితర డిమాండ్లతో విజయవాడలో ఈనెల 12న బుధవారం ఉదయం 10 గంటలకు ధర్నా చౌక్ వద్ద జరగనున్న మహా ధర్నాకు ఉపాధి హామీ కూలీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాదవ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి ఉపాధి హామీ కూలీలను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు.

తవ్వకాలు నిలువుదల చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

ముదినేపల్లి : మండలంలోని వణుదుర్రులో ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపట్టిన ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు, మట్టి అక్రమ తోలకాలను వెంటనే నిలుపుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సోమవారం ఏలూరులోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు గ్రామంలో విచ్చలవిడిగా చెరువుల అక్రమ తవ్వకాలు, మట్టి అక్రమ తోలకాలు చేస్తూ గ్రామంలోని సహజ వనరులను తరలించుకుపోతున్నారన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొనిమట్టి అక్రమ తోలకాలను నిలుపుదల చేయాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే యువకుడి మృతి : సిఐటియు

ఏలూరు అర్బన్ : ప్రసాద్ సీడ్స్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదానికి అధికారులు తనిఖీలు చేయకపోవడమే కారణమని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్‌లు విమర్శించారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తనిఖీలు చేపట్టని ఫలితంగా ఎస్.రవీంద్ర అనే కార్మికుడు సోమవారం మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి ఫ్యాక్టరీలలో జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకొని యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తరచుగా ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నా అటు ప్రభుత్వం నుంచిగాని, ఇటు ఫ్యాక్టరీల యజమానుల నుంచి గాని ఏవిధమైన చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవని విమర్శించారు. కార్మిక శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకొని ఫ్యాక్టరీ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సొసైటీ భూములు తిరిగి అప్పగించాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ భూములను తమకు తిరిగి అప్పగించాలని కొల్లేరువాసులు డిఆర్ఒ విశ్వేశ్వరరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. జనసేన దెందులూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఘంటసాల వెంకటలక్ష్మి ఆధ్వర్యాన కొల్లేరు రైతులు డిఆర్ఒను కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా ఘంటసాల వెంకటలక్ష్మి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల పేరుతో సొసైటీ భూముల్లో చెరువులను అటవీశాఖ వన్యప్రాణి విభాగ అధికారులు ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. వంద సంవత్సరాల నుంచి అక్కడే జీవిస్తున్న పేదల బతుకులు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొల్లేరు రీజినల్ అగ్రికల్చర్ ఫిషర్మెన్ సొసైటీస్ సెక్రటరీ బాల యేసురాజు, కొల్లేరు రైతులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని కోనేరు పేటలో గల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద దోమల నివారణపై మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దోమల నివారణకు తీసుకోవలసిన చర్యలపై ముద్రించిన గోడ పత్రికను విడుదల చేశారు. దోమకాటుకు గురైతే తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రికి రావాలన్నారు. వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈనెల 24, 25 తేదీలలో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపుమేరకు సమ్మె చేస్తున్నట్లు ఏలూరు జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం అధ్యక్షులు డి.శ్రీనివాస్ మోహన్ తెలిపారు. ఈనెల 24, 25 తేదీలలో జరుగు సమ్మెలో భాగంగా మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ వద్ద బ్యాంకు ఉద్యోగులు యుఎఫ్‌బియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు ఎన్.లక్ష్మణరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శిగా రామిశెట్టి

ప్రజాశక్తి - ముదినేపల్లి

వైసిపి రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శిగా మండల ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ మంగళవారం నియమితులైయ్యారు. ఈ సందర్భంగా ఎంపిపి సత్యనారాయణ తన కార్యాలయంలో మాట్లాడుతూ తనకి రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శిగా అవకాశం కల్పించిన మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ రాష్ట్ర ముదిరాజ్ విభాగం అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్, శీలం రామకృష్ణ, కిషోర్ అభినందించారు.

ప్రకటన

నా క్లైయింట్ అయిన ఖండవల్లి సుహాస్ దేవ్, S/o. మణిరాజు నివాసము జట్లపాలెం నాకు ఇచ్చినటువంటి సమాచారము ప్రకారము సదరు నా క్లైయింటు ఖండవల్లి సుహాస్ దేవ్ గారు ప.గో॥జిల్లా, తాడేపల్లిగూడెం సబుడి, తాడేపల్లిగూడెం మున్సిపాలిటి, 27వ వార్డు, R.S.No. 166/3 దాఖలా డోర్ నెం. 14-47-27 రు దాఖలా చ.గ.118-88 స్థలము ఇందులో గల రేకుల షెడ్డు ఇల్లు సహా ఆస్థిని ఖండవల్లి నాగరాజు గారి భార్య ఖండవల్లి సాయివాణి గారి నుండి క్రయం పొందుటకు నిర్ణయించుకున్నారు. సదరు ఆస్థిపై ఎవ్వరికైనా ఎటువంటి బకాయిలు వున్ననూ, ఎటువంటి తగాయిదాలు వున్ననూ ఈ రోజు నుండి 07 రోజులు లోగా నా క్లైయింటు అడ్రస్సుకు గాని, నా అడ్రస్సుకు గాని నోటీసు పూర్వకంగా తెలియపరచవలెను. సదరు గడువు కాలపరిమితి 07 రోజులు ముగిసిన తదుపరి ఎవ్వరైననూ ఎటువంటి చర్యలు జరిగించిననూ అవి నా క్లైయింటును బైండ్ చేయజాలవు.

మీసాల జగదీష్
అడ్వకేటు, రామచంద్రపురం
సెల్: 63053 07196

మహారాజశ్రీ ఏలూరు 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

M.V.O.P. No. 318/2023

బిట్వీన్ :
యడ్ల దేవమాత ...పిటీషనరు
Vs
సాహన్ వగైరా ...రెస్పాండెంట్లు
To,
R2) పార్వతి పరమేశ్వర ట్రాన్స్‌లాజిస్టిక్స్ (P), No. 922, 28th మెయిన్, 18th క్రాస్, D. గ్రూప్, పూర్ణచంద్ర లే అవుట్, నాగర్‌బావి,చిక్క బినవర, బెంగుళూరు, కర్ణాటక-560090.

పై నెంబరు గ్రంథములో R2 అయిన మీరు పై కోర్టులో ప్రత్యక్షంగా కానీ, వకీలు ద్వారా కానీ **ది.21-03-2025వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలయునని, లేని యడల మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని యిందుమూలముగా తెలియచేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

B. Thukaram,
B.Sc.,B.L.,
Advocate
Eluru, Eluru.Dt
Ph: 235764

Eluru
Date: 11-03-2025

దస్తావేజు పోయినది

నా క్లైయింటు నాకు ఇచ్చిన సంజాయిషి ప్రకారం: తూర్పుగోదావరి జిల్లా, నల్లజర్ల మండలం, అచ్చన్నపాలెం గ్రామ కాపురస్థులైన కొరపాటి వెంకట సుబ్బారావు గారి భార్య వీరాకుమారి అభ్యర్ధన:

పై గ్రామంలోని R.S.No. 323/3B లోని Door No. 2-103 గల R.C.C. బిల్డింగ్ వారికి వారి సోదరుడు మరియు తల్లి గారి ద్వారా Gift Settlement దస్తావేజు ద్వారా వారికి వచ్చియున్నది. దానికి లింక్ డాక్యుమెంట్ అయినటు వంటి ప్రభుత్వ పట్టా అనగా తహశీల్దారు నల్లజర్ల మండలం ద్వారా వారి తండ్రి గారైన గారపాటి ఏసురత్నం గారికి పై తెలిపిన స్థలం రిత్యా ఇవ్వబడిన పత్రం, కొన్నిరోజుల క్రితం తన స్వగృహం అచ్చన్నపాలెం నుండి తాడేపల్లిగూడెం వెళ్ళుతుండగా పోగొట్టుకొనియున్నారు. కావున ఆ పత్రము ఎవరికైనా దొరికిన యెడల నా క్లైయింటుకు అందజేయగలరు.

P.V.N.V.BHADRUDU
Advocate
Tadepalligudem
Mob No. 77023 11197

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ

'e' ప్రొక్యూర్మెంటు టెండర్ నోటీసు

ఆర్.ఒ.సి. నెం. 39/2024-ఇ.1. ది. 11-03-2025

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఈ దిగువ తెలిపిన పనులు చేపట్టుటకు 'ఇ' ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండరులు పిలువబడుచున్నది.

వ.నెం.	పని వివరము	పనుల సంఖ్య	ECV (రూ.లక్షలలో)
1	జంగారెడ్డిగూడెం పురపాలక సంఘ పరిధిలోని లలితమ్మ టెంపుల్ నుండి పారిజాతగిరి ఆర్చి వరకు బిటి రోడ్డు నిర్మాణం (15th FC ఫండ్స్)	1	69.44

సంబంధిత వివరములు https:\tender.epeprocurement.gov.in వెబ్ సైటు నందు ది. 12-03-2025 వ తేది ఉదయం గం. 10-00 ల నుండి చూడవచ్చును. ఇతర వివరములకు మున్సిపాలిటీ కార్యాలయము, ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- **కమీషనర్**
జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ.

గ్రావెల్ అక్రమ తవ్వకాలు అడ్డగింత

రెండు లారీలు సీజ్

ఉంగుటూరు : పోలవరం కాలువ గట్టున మండలంలోని కంసాలిగుంట వద్ద సోమవారం రాత్రి అక్ర మంగా కంకర తవ్వి లారీలపై తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. అనంతరం ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలవరం కాలువ సంబంధిత సెక్షన్ ఎఇ బాపూడి తన సిబ్బందితో పాటు రెవెన్యూ, పోలీసు యంత్రాంగంతో రాత్రి ఘటనా స్థలానికి చేరుకుని కంకర రవాణా చేస్తున్న రెండు లారీల్లో ఒకదాన్ని అదే రోజు రాత్రి చేబ్రోలు పోలీసు స్టేషన్‌కి తరలించారు. రెండో లారీ డ్రైవర్ తాళాలతో పారిపోవడంతో మంగళవారం మధ్యాహ్నానికి ఆ లారీని కూడా పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా కంకర తవ్వేందుకు వచ్చిన 200 ప్రొక్లైయిన్ ఘటనా స్థలానికి దూరంగా ఉంచేయటంతో యంత్రాన్ని సీజ్ చేయలేకపోయారు. ఇరిగేషన్ ఎఇ బాపూజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు ఎస్ఐ సూర్యభగవాన్ వెల్లడించారు.

మహిళను రక్షించిన పోలీసులు

ఏలూరు స్పోర్ట్స్: కుటుంబ కలహాల నేపథ్యంలో మహిళ ఆత్మహత్యకు పాల్పడాలని నిర్ణయం తీసుకుని ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుందామనుకునే లోపే రైల్వే పోలీసులు అక్కడికి చేరుకొని ఆమెను రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ సైమన్ తన సిబ్బందితో కలిసి ఆమెను రక్షించి ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గ్రామపంచాయతీ కార్యాలయము, పాలచర్ల. రాజవరం

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం./2025 తేది.11-03-2025

ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం, పాలచర్ల.రాజవరం గ్రామపంచాయతీ యొక్క ఈ క్రింది తెలిపిన షెడ్యూలు దాఖలా సిబ్బందికి నియమకం చేయుటకు సీల్డు వేసిన టెండర్లు ది. 24-03-2025వ తేదీన ఉదయం గం. 11.30 ని॥లకు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని, లేక వారిచే అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు స్వీకరించబడును. మరియు అదేరోజు మధ్యాహ్నం గం. 12.30 ని॥లకు హాజరైన టెండర్లదారుల సమక్షంలో సదరు టెండర్లు తెరవబడును. డిపాజిట్లు చెల్లించని టెండర్లు స్వీకరించబడవు. ఇతర విషయములు ఆఫీసు పని వేళల యందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరములు	సంఖ్య	కాలము	ధరావత్తు
1	పారిశుద్ధ్యం-ప్రజారోగ్యం నిర్వహణ	2	1-4-2025 నుండి 31-3-2026 వరకు	1 సం॥ము
2	మంచినీటి సరఫరా నిర్వహణ	1	1-4-2025 నుండి 31-3-2026 వరకు	కాలమువరకు
3	వీధి విద్యుత్ లైట్లు నిర్వహణ	1	1-4-2025 నుండి 31-3-2026 వరకు	6000/-

గమనిక: 1నిధుల నిల్వలు బట్టి నెలకు ఒక పర్యాయము జీతాలు చెల్లించబడును.

సం/- **కుంజా రవీంద్ర**
పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ పాలచర్ల.రాజవరం
జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా.

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 114/General/2024-25, Dated. 11-03-2025

The Commissioner, Municipal Corporation, Eluru inviting tenders from the interested, eligible Contractors for **"Supply and delivery of 50HP DAM and 90HP DAM vertical Open well submersible pump set to Denduluru raw water pumping station of Eluru Municipal Corporation."** with an amount of Rs. **38.79** Lakhs.

Last date for receipt of application towards tender schedule is 18-03-2025. Last date of receipt of tenders is 19-03-2025. Further details can be known from this office detailed tender notice or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-232101).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU

గ్రామపంచాయతీ కార్యాలయము, బొమ్మినంపాడు

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.5/2024 తేది.11-03-2025

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, బొమ్మినంపాడు గ్రామపంచాయతీ కాంట్రాక్టు లేబర్ పద్ధతిపై ఈ క్రింది పనులు ది.01-04-2025 తేది నుండి ది.31-03-2026 వరకు నిర్వహించుటకు గాను సీల్డు టెండర్లు కోరబడుతున్నది. ఈ టెండర్లను ది.22-03-2025 తేది ఉదయం 11.00 గంటల వరకు బొమ్మినంపాడు గ్రామపంచాయితీ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, లేక వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు స్వీకరించబడి, అదే రోజు సాయంత్రం 2-00 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షంలో సీల్డు టెండర్లు తెరువబడును. ప్రభుత్వ నిబంధనలకు లోబడి టెండర్లు దాఖలు పరచవలెను. ఇతర వివరములకు కార్యాలయము పనిచేయు వేళలందు పంచాయితీ నందు అడిగి తెలుసుకొనగలరు.

వ.నెం.	పనిపేరు	సంఖ్య	కాలపరిమితి	ధరావత్తు
1	పారిశుద్ధ్య కార్మికులు	02	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-
2	PWS మోటార్ ఆపరేటర్	02	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-
3	ఎలక్ట్రీషియన్	01	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-

నోట్: 1) గతంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2) పంచాయితీ నిధులు, నిల్వలను బట్టి పేమెంట్ చెల్లించబడును. 3) ఎలక్ట్రీషియన్ పని కొరకు దరఖాస్తు చేసుకొన్న వారు సంబంధిత ప్రావీణ్యతా ధ్రువీకరణ పత్రంను సమర్పించవలెను. 4) టెండర్లను స్వీకరించుటకు లేదా తిరస్కరించుటకు పంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు. 5) టెండర్ అమోదము పొందిన వారు పంచాయితీ వారి విధులకు అంగీకరిస్తూ అగ్రిమెంట్ రాసి ఇవ్వవలెను.

సం/- **దారం సుధ**
సర్పంచ్, బొమ్మినంపాడు గ్రామపంచాయితీ
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా.

సం/- **మల్లెల శ్రీనివాసు**
గ్రామపంచాయితీ కార్యదర్శి, బొమ్మినంపాడు
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా.

గ్రామపంచాయతీ కార్యాలయము, ములకలపల్లి

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.1/2024 తేది.11-03-2025

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, ములకలపల్లి గ్రామపంచాయితీ నందు కాంట్రాక్టు లేబర్ పద్ధతిపై ఈ క్రింది పనులు ది.01-04-2025 తేది నుండి ది.31-03-2026 వరకు నిర్వహించుటకు గాను సీల్డు టెండర్లు కోరబడుతున్నది. ఈ టెండర్లను ది.22-03-2025 తేది ఉదయం 12.00 గంటల వరకు ములకలపల్లి గ్రామపంచాయితీ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, లేక వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు స్వీకరించబడి, అదే రోజు సాయంత్రం 4-00 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షంలో సీల్డు టెండర్లు తెరువబడును. ప్రభుత్వ నిబంధనలకు లోబడి టెండర్లు దాఖలు పరచవలెను. ఇతర వివరములకు కార్యాలయము పనిచేయు వేళలందు పంచాయితీ నందు అడిగి తెలుసుకొనగలరు.

వ.నెం.	పనిపేరు	సంఖ్య	కాలపరిమితి	ధరావత్తు
1	పారిశుద్ధ్య కార్మికులు	01	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-
2	PWS మోటార్ ఆపరేటర్	01	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-
3	ఎలక్ట్రీషియన్	01	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-

నోట్: 1) గతంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2) పంచాయితీ నిధులు, నిల్వలను బట్టి పేమెంట్ చెల్లించబడును. 3) ఎలక్ట్రీషియన్ పని కొరకు దరఖాస్తు చేసుకొన్న వారు సంబంధిత ప్రావీణ్యతా ధ్రువీకరణ పత్రంను సమర్పించవలెను. 4) టెండర్లను స్వీకరించుటకు లేదా తిరస్కరించుటకు పంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు. 5) టెండర్ అమోదము పొందిన వారు పంచాయితీ వారి విధులకు అంగీకరిస్తూ అగ్రిమెంట్ రాసి ఇవ్వవలెను.

సం/- **ఘంటా వెంకట నాగేశ్వరరావు**
సర్పంచ్, ములకలపల్లి గ్రామపంచాయితీ
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా.

సం/- **మల్లెల శ్రీనివాసు**
గ్రామపంచాయితీ కార్యదర్శి, ములకలపల్లి
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా.

గ్రామపంచాయతీ కార్యాలయము, వైవాక

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.3/2024 తేది.11-03-2025

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, వైవాక గ్రామపంచాయితీ నందు కాంట్రాక్టు లేబర్ పద్ధతిపై ఈ క్రింది పనులు ది.01-04-2025 తేది నుండి ది.31-03-2026 వరకు నిర్వహించుటకు గాను సీల్డు టెండర్లు కోరబడుతున్నది. ఈ టెండర్లను ది.22-03-2025 తేది ఉదయం 11.00 గంటల వరకు వైవాక గ్రామపంచాయితీ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, లేక వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు స్వీకరించబడి, అదే రోజు సాయంత్రం 2-00 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షంలో సీల్డు టెండర్లు తెరువబడును. ప్రభుత్వ నిబంధనలకు లోబడి టెండర్లు దాఖలు పరచవలెను. ఇతర వివరములకు కార్యాలయము పనిచేయు వేళలందు పంచాయితీ నందు అడిగి తెలుసుకొనగలరు.

వ.నెం.	పనిపేరు	సంఖ్య	కాలపరిమితి	ధరావత్తు
1	పారిశుద్ధ్య కార్మికులు	01	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-
2	PWS మోటార్ ఆపరేటర్	02	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-
3	ఎలక్ట్రీషియన్	01	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-

నోట్: 1) గతంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2) పంచాయితీ నిధులు, నిల్వలను బట్టి పేమెంట్ చెల్లించబడును. 3) ఎలక్ట్రీషియన్ పని కొరకు దరఖాస్తు చేసుకొన్న వారు సంబంధిత ప్రావీణ్యతా ధ్రువీకరణ పత్రంను సమర్పించవలెను. 4) టెండర్లను స్వీకరించుటకు లేదా తిరస్కరించుటకు పంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు. 5) టెండర్ అమోదము పొందిన వారు పంచాయితీ వారి విధులకు అంగీకరిస్తూ అగ్రిమెంట్ రాసి ఇవ్వవలెను.

సం/- **నున్న పద్మావతి**
సర్పంచ్, వైవాక గ్రామపంచాయితీ
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా.

సం/- **పి. మనోజ్ కుమార్**
గ్రామపంచాయితీ కార్యదర్శి, వైవాక
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా.